క్లుప్తంగా

అలరించిన ఫన్ గేమ్ షో



తెనాలి రూరల్: తెనాలి డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రమ్‌లో 'ఆంధ్రా ప్యారిస్ హాహా గేమ్స్ ఫన్ ఫ్యామిలీ షో' పేరిట ఫన్ షోను నిర్వహించారు. ప్రముఖ కమెడియన్లు బుల్లెట్ భాస్కర్, నాటి నరేష్, శాంతి స్వరూప్ బృందం స్కిట్లతో అలరించింది. సినీ, బుల్లితెర కొరియోగ్రాఫర్ల నృత్యాలు ఆకట్టుకున్నాయి. సభను సాయి లక్కరాజు నిర్వహించగా సునీల్ పర్యవేక్షించారు.

అప్రెంటిస్ మేళాకు 120 మంది విద్యార్థుల హాజరు



తెనాలి రూరల్: తెనాలి జగ్గడిగుంటపాలెంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)లో సోమవారం ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 12 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. తమకు అవసరమైన విద్యార్థుల్ని ఎంపిక చేసుకున్నారు. మేళాకు 120 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమాన్ని శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ రావి చిన వెంకటేశ్వర్లు, సిబ్బంది పర్యవేక్షించారు.

18న శంకరుని సత్రం షాపుల వేలం

తెనాలి: పట్టణ బోసు రోడ్డులోని శ్రీకాకుమాను శంకరుని ధర్మసత్రానికి చెందిన 2,11,13 షాపులకు మూడేళ్ల అద్దె హక్కునకు ఈనెల 18న సీల్డ్ టెండరు-కం-బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి మండె పూడి పానకాలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆరోజు ఉదయం 11.30 గంటలకు దేవదాయ అధికారుల సమక్షంలో సత్రం కార్యాలయంలో వేలం జరుగుతుందని, ఆసక్తి కలిగిన వ్యాపారులు పాల్గొనాలని ఆయన కోరారు.

పవర్ లిఫ్టర్ జ్ఞానదివ్యకు సత్కారం



తెనాలి రూరల్: తెనాలి మండలం కొలివరం గ్రామానికి చెందిన పవర్ పవర్ లిఫ్టర్ నాగం జ్ఞానదివ్యకు తెనాలిలో ఘన స్వాగతం లభించింది. కేరళ రాష్ట్రం అలెప్పీలో జరిగిన ఆసియా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని నాలుగు సిల్వర్ పతకాలు సాధించిన ఆమెకు సోమవారం ఉదయం తెనాలిలో పలువురు స్వాగతం పలికి అభినందించారు. స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ఉదయం జరిగిన స్వాగత కార్యక్రమంలో కొలివరం గ్రామస్తులతో పాటు నందివెలుగు గ్రామానికి చెందిన మేము సైతం సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడంపై అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మేము సైతం సంస్థ సభ్యులు ఎం.జగన్మోహన రావు, షేక్ షుకూర్ బాష, కళ్యాణం నరసింహారావు, విష్ణుమొలకల నాగేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తెనాలి టౌన్: పట్టణ రైల్వేస్టేషన్ రోడ్డులో అన్నదాత సుఖీభవ ఆధ్వర్యంలో సోమవారం పేదలకు అన్నదానం చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించినట్లు శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి అధ్యక్షులు కుర్రా శ్రీను తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి అన్నదానాన్ని ప్రారంభించారు. స్వామి జ్ఞానప్రసన్న ఆశీస్సులతో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు శ్రీను చెప్పారు.

టెన్త్ పాసైన విద్యార్థులకు ఉచిత ఐఐటీ, నీట్ ఫౌండేషన్ తరగతులు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు మొదటి ప్రయత్నంలోనే ఐఐటీ, నీట్ సాధించడమెలా ? అనే అంశంపై ఈనెల 14 నుంచి ఐదు రోజుల పాటు ఉచిత అవగాహన తరగతుల్ని నిర్వహిస్తున్నట్లు మెటా మైండ్ అకాడమీ డైరెక్టర్ మనోజ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేర్లు నమోదు చేసుకున్న విద్యార్థులకు హైదరాబాద్ దోమలగూడలోని రామకృష్ణ మఠం వద్ద ఉన్న అకాడమీలో ఐదు రోజుల పాటు ఉచిత హాస్టల్ వసతితో శిక్షణ కల్పిస్తామని తెలిపారు. ఉచిత రిజిస్ట్రేషన్ కోసం 8522958575, 7032264910 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సంక్షేమమే పరమావధిగా జగన్ పాలన

'గడప గడపకు' కార్యక్రమంలో ఎమ్మెల్యే శివకుమార్



మహిళలకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి రూరల్: సంక్షేమమే పరమావధిగా సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలన జరుగుతోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. తెనాలి మండలం జగ్గడిగుంటపాలెం గ్రామంలో సోమవారం సాయంత్రం ఐదో రోజు నిర్వహించిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే శివకుమార్ ఇంటింటికీ వెళ్లారు. ప్రభుత్వ పాలనపై ప్రజల స్పందనతో పాటు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, స్థానికంగా గ్రామంలోని సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల్ని ఇంటింటికీ తీసుకువెళ్లి ప్రభుత్వం అందించిన పథకాల వివరాల్ని తెలియజేశారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్ని ప్రజాప్రతినిధులు నేరుగా ప్రజల వద్దకు వెళ్లి వివరించడం, ప్రజల సమస్యల్ని నేరుగా తెలుసుకునేందుకు వారధిగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని చెప్పారు. గ్రామంలోని వైఎస్సార్ కాలనీలో విద్యుత్ సమస్య పరిష్కారం కోసం ట్రాన్స్‌ఫార్మర్ కోసం రూ. ఆరు లక్షలు, రోడ్డు కోసం రూ. 10 లక్షలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే వెంట గ్రామ సర్పంచ్ కుంభం బాలాజీ, ఎంపీటీసీ సభ్యురాలు కాజా భద్రావతి, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు పసుపులేటి వెంకయ్య, కౌన్సిలర్లు యాతాటి అనిల్, షేక్ దుబాయ్‌బాబు, గ్రామ ఉప సర్పంచ్ గోలి లక్ష్మీనారాయణ, అక్కిదాసు కిరణ్‌కుమార్, కొడాలి క్రాంతి, గ్రామ సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతా : ఎమ్మెల్యే



కొలివరంలో మొక్కజొన్న కండెలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి టౌన్: వర్షాలకు పంటలు నష్టపోయిన రైతుల్ని అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. రూరల్ మండలం కొలివరం, కోపల్లె గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, జొన్న పొలాల్ని పరిశీలించారు. రైతుల సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని చెప్పారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. ఇప్పటికే వ్యవసాయశాఖ సిబ్బంది పంటనష్టం అంచనా వేస్తున్నారని, రెండు రోజుల్లో విధి విధానాలు వస్తాయని వెల్లడించారు. రైతు సంఘ నాయకులు ములకా శివసాంబిరెడ్డి రైతు సమస్యల్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. పెట్టుబడి రూ.25 వేల నుంచి రూ.30వేల వరకు పెట్టారని, కనీస మద్దతు ధరకు పసుపు, మొక్కజొన్న కొనుగోలు చేసే విధంగా చూడాలని ఆయన ఎమ్మెల్యేను కోరారు. మొలకెత్తిన మొక్కజొన్న కండెలు, జొన్న కంకుల్ని రైతులు ఎమ్మెల్యేకు చూపించారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్, ఉద్యానశాఖ అధికారి కె.విజయమోహన్, వైఎస్సార్ సీపీ నాయకులు సంకురు బుజ్జిబాబు, తమ్మా శివారెడ్డి, కారుమంచి కిశోర్ బాబు, తుల్లిమిల్లి శ్యామేల్, సువర్ణబాబు, ఎల్‌బీసీ చిన్ని, మహేష్, బూరెల దుర్గాప్రసాద్, కఠారి హరీష్, రైతు సంఘ నాయకులు సాంబిరెడ్డి, ఎం.సాంబశివరావు, జి.గోపీచంద్, కొల్లి రంగారెడ్డి, వేజండ్ల రోశయ్య, మహమ్మద్ ఖాన్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు వరం



మున్నంగిలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న గ్రామ పెద్ద కోటిరెడ్డి

కొల్లిపర: గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు వరమని మున్నంగి గ్రామ పెద్ద ఆరిగ కోటిరెడ్డి తెలిపారు. గ్రామంలోని గ్రంథాలయంలో సోమవారం ఆయన వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో సెలవుల్లో విద్యార్థుల్లో దాగున్న సృజనాత్మకతను వెలికి తీసేలా విభిన్న అంశాలపై గ్రంథాలయాల్లో అవగాహన కల్పించడం ఎంతో అభినందనీయమన్నారు. గ్రంథాలయాధికారి బి.నాగసాంబశివనాయక్ మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులు చదువుకు, విజ్ఞానానికి దూరం కాకూడదన్న ముఖ్య ఉద్దేశంతో నిర్వహిస్తున్న శిబిరాన్ని సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని సూచించారు. జూన్ 11వ తేదీ వరకూ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎ.శ్రీధర్‌రెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తెనాలి గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

తెనాలి: స్థానిక నెహ్రూ రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాన్ని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు ప్రారంభించారు. శిబిరంలో 30 పైగా విద్యార్థులు పాల్గొన్నారు. చిత్రలేఖన ఉపాధ్యాయుడు జయశేఖర్ డ్రాయింగ్‌లో మెలకువలు బోధించారు. షేక్ అబ్దుల్ హకీం జాని నీతికథలు చెప్పారు. గ్రేడ్-1 లైబ్రేరియన్ కె.రమాదేవి సుమతీ శతక పద్యాల్ని నేర్పించారు. విశ్రాంత లైబ్రేరియన్ మొవ్వా సుబ్బారావు పాల్గొన్నారు. విద్యార్థులు, అతిథులు, పాఠకులకు అల్పాహారం, మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు.

విప్లవ మార్గాన నడిచిన ధీశాలి అల్లూరి



సభలో మాట్లాడుతున్న ప్రజానాట్యమండలి కార్యదర్శి నీలాంబరం

తెనాలి టౌన్: పట్టణ గాంధీనగర్‌లోని బొల్లిముంత ఫౌండేషన్ హాలులో అభ్యుదయ కళాసమితి, ఏపీ ప్రజానాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభకు విశాలాంధ్ర పబ్లిషింగ్ మాజీ కార్యదర్శి బొల్లిముంత అమరేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఏపీ ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి నీలాంబరం మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మన్యం ప్రజల్ని పోరాట యోధులుగా తీర్చిదిద్ది, విప్లవ మార్గాన నడిపిన ధీశాలి అల్లూరి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో నూకల భాస్కరరావు, శ్రీదేవి, బొల్లిముంత కృష్ణ, బెల్లకొండ వెంకట్, రత్నకుమారి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

దళితవాడలు, బీసీ కాలనీలు జలమయం



కొలకలూరు బీసీ కాలనీలో జలమయమైన రోడ్డు

తెనాలి టౌన్: అల్పపీడన ద్రోణి ప్రభావం వల్ల ఇటీవల ఐదు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మండల గ్రామాల్లోని దళితవాడల్లో పల్లపు ప్రాంతాలు, బీసీ కాలనీల్లో రోడ్లు జలమయమయ్యాయి. కొలకలూరు బీసీ కాలనీలో జూబ్లీ స్కూలు పక్కన రోడ్డు వర్షం నీటితో మునిగిపోయింది. నీరు పారుదల కాకపోవడంతో ఇళ్లల్లోకి ప్రవేశించింది. మెయిన్ రోడ్డుకు ఇరువైపులా సైడు కాల్వల్లో నీరు రోడ్డు మీదుకు రావడంతో ఈ పరిస్థితి దాపురించింది. నందివెలుగు, హాఫ్‌పేట, కోపల్లె, గుడివాడ తదితర దళితవాడల్లో వర్షపునీరు చేరింది. అధికారులు స్పందించి నీటి పారుదలకు చర్యలు తీసుకోవాలని నివాసితులు కోరుతున్నారు.

స్థిరమైన లక్ష్యంతోనే సివిల్స్‌లో విజయం



శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న అశ్విన్ మణిదీప్

గుంటూరు ఎడ్యుకేషన్: స్థిరమైన లక్ష్యం, కృషి, పట్టుదలతో సివిల్స్‌లో విజయం తథ్యమని ఐఆర్ఎస్ అధికారి అశ్విన్ మణిదీప్ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో కేవీఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ (సన్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐఏఎస్ ఫౌండేషన్ తరగతుల్లో భాగంగా సోమవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సివిల్స్‌కు సన్నద్ధతలో పాటించాల్సిన విధానాలు, సమకాలీన అంశాల గురించి వివరించారు. ఈనెల 16వ తేదీ వరకు తరగతుల్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సన్ నిర్వాహకులు కె.సాయికుమార్, సీహెచ్.బాలు, ఎం. అజయ్, పీర్ సాహెబ్ పాల్గొన్నారు.

గురుకుల విద్యాలయాల్లో అద్భుతమైన ఫలితాలు



నరసింహారావును సత్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, మల్లేశ్వర్, మధుసూదనరావు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీఆర్ఈఐఎస్) యాజమాన్యంలోని పాఠశాలలు అద్భుతమైన ఫలితాల్ని సాధించడం అభినందనీయని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు పేర్కొన్నారు. కొరిటెపాడులోని సంస్థ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం డైరెక్టర్ ఆర్. నరసింహారావును ఆయన కలిశారు. టెన్త్‌లో అత్యధికంగా 95.25 శాతం ఉత్తీర్ణత నమోదైన సందర్భంగా శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో గురుకుల విద్యాలయాల సంస్థ ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలని కోరుతూ టీడీపీ ధర్నా

తెనాలి రూరల్: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతుల్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, కన్నా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, టీడీపీ నాయకులు అహ్మద్, కోవెలమూడి రవీంద్ర, స్థానిక నాయకులు పాల్గొన్నారు. వర్షాలకు తడిచిన జొన్న, మొక్కజొన్న కంకుల్ని సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో కింద పోసి నిరసన తెలియజేశారు. పంట నష్టపోయిన రైతాంగానికి తక్షణమే నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ శివనారాయణశర్మకు వినతిపత్రం అందజేశారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

తెనాలి రూరల్: కట్నం వేధింపులపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని చినరావూరుకు చెందిన సాయిప్రసన్నకు కృష్ణాజిల్లాకు చెందిన లక్ష్మయ్యతో వివాహమైంది. ఇటీవల భర్త కట్నం కోసం వేధిస్తున్నాడని ఆమె సోమవారం వన్‌టౌన్ పోలీసుల్ని ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

తెనాలి రూరల్: వివాహిత అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ ముత్తెంశెట్టిపాలేనికి వివాహిత గంటినపల్లి స్వరూప (32) ఆదివారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. గాలించినా ఫలితం లేకపోవడంతో భర్త వన్‌టౌన్ పోలీసుల్ని ఆశ్రయించారు. సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు.

మహిళ ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: మహిళ ఆత్మహత్యపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. ముత్యాలరెడ్డినగర్‌లో నివసించే గంగూరి శ్రీనివాసరావు భార్య అరుణ (44) తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. కడుపు నొప్పి తాళలేక సోమవారం ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గురుద్రోహి సన్యాస దీక్ష రద్దు



పాత గుంటూరు: తన వద్ద సన్యాస దీక్ష తీసుకున్న సాంబశివానంద భారతి(అలవలపాటి రామ్మోహన్) తమ పీఠ ప్రతినిధి అని అసత్య ప్రచారం చేస్తున్నారని, అది వాస్తవం కాదని శ్రీ శృంగేరి విరూపాక్ష పీఠాధిపతులైన గంభీరానంద భారతీస్వామి తెలిపారు. అరండల్‌లోని శృంగేరి విరూపాక్ష పీఠంలో సోమవారం విలేకరుల సమావేశంలో స్వామి మాట్లాడారు. పరమపూజ్య శ్రీ కుర్తాళం పీఠాధిపతుల గురించి అసత్య ప్రచారం చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. గురుద్రోహం, హిందూ ధర్మ విరుద్ధమైన పనులు చేస్తున్న సాంబశివానంద భారతి సన్యాస దీక్షను రద్దు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. నేటి నుంచి అతనికి, తమ పీఠానికి ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. పీఠం పేరును అతను ఉపయోగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని భారతీస్వామి వెల్లడించారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి



గుంటూరు రూరల్: గుర్తు తెలియని సుమారు 70 ఏళ్ల వృద్ధురాలు మృతి చెందిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం పెదపలకలూరు గ్రామం ఎల్ఐసీ కాలనీ నుంచి గోర్లవారిపాలెం వెళ్ళే రోడ్డులో నారాయణ కళాశాల సమీపంలో వృద్ధురాలు మృతి చెందిందని సమాచారం మేరకు పోలీసులకు స్థానికులు సమాచారం అందించటంతో ఘటన స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించామని పేర్కొన్నారు. మృతదేహంపై కాషాయం రంగు చీర ధరించి ఉందని వివరించారు.

తడిసిన పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలి



గుడివాడ సచివాలయంలో వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

తెనాలి టౌన్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తడిసిన వాణిజ్య పంటల్ని ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రూరల్ మండలం గుడివాడ రైతు భరోసా కేంద్రంలో సిబ్బందికి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ఆధ్వర్యంలో రైతులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ అకాల వర్షం వల్ల కల్లాల్లోని పసుపు, మొక్కజొన్న, జొన్న పంటలు తడిసి పోయాయని తెలిపారు. పంట దెబ్బతినడంతో రైతులు నష్టపోయే ప్రమాదముందని, ప్రభుత్వం స్పందించి తడిసిన పంటల్ని కొనుగోలు చేయాలని కోరారు. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్ని ఏర్పాటు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు ముద్దన సాంబశివరావు, తులాబంధుల ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

నటుడు రాధాకృష్ణారెడ్డికి సన్మానం



తెనాలి అర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో సోమవారం అష్టమిత్రుడు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. మంగళవారం స్వర్ణమంజరి చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం పౌరాణిక, సాంఘిక నాటక కళాకారుడు ఆరేమండ రాధాకృష్ణారెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పినపాటి రవీంద్ర, కట్ల శ్రీనివాసరావు, వేములపల్లి సుబ్బారావు, శివనాగమల్లేశ్వరరెడ్డి, భీమవరపు తాతిరెడ్డి, కంకిపాటి శ్రీనివాసరావు, ఫణీదపు దుర్గా, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవాని, ఈదర శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, గుమ్మడి ప్రసాద్, కాళహస్తి రఘు, ముళ్లపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్, నరసయ్య పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ సభ్యురాలు సెలీనాకు అభినందనలు



డాక్టర్ సెలీనాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ మోజెస్, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) సభ్యురాలిగా డాక్టర్ బీఎస్ సెలీనా నియామకంపై ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొమ్మాలపాటి మోజెస్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం మంగళగిరిలోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో అకడమిక్ అధికారిగా పని చేస్తున్న సెలీనాను కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మోజెస్ మాట్లాడుతూ ఏసీ కళాశాల పూర్వ విద్యార్థిని అయిన డాక్టర్ బీఎస్ సెలీనాను సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఏపీపీఎస్సీ సభ్యురాలిగా నియమించడం ద్వారా విద్యారంగంలో ఆమె సాధించిన అపారమైన అనుభవానికి తగిన గుర్తింపు ఇచ్చారని తెలిపారు. సెలీనా తండ్రి బి. చంద్రపాల్ ఏసీ కళాశాల ప్రిన్సిపాల్‌గాను, ఆమె తల్లి సూజన్ ప్రమీల బోటనీ అధ్యాపకురాలిగా పని చేశారని చెప్పారు. ఈసందర్భంగా డాక్టర్ సెలీనాకు కళాశాల కరస్పాండెంట్, మోడరేటర్ బిషప్ డాక్టర్ కేఎఫ్ పరదేశిబాబు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ ఎం.ఎస్ శ్రీధర్, అధ్యాపకులు ప్రీతం ప్రకాష్, ఎజ్రా విజయశేఖర్, పీఎం వినయతేజ పాల్గొన్నారు.

రాజధానిపై మాట తప్పిన వైఎస్సార్ సీపీ

- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పాతూరి నాగభూషణం
- వైఎస్సార్ సీపీ పాలనపై బీజేపీ చార్జిషీట్ విడుదల

గుంటూరు మెడికల్: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి రాజధానిపై మాట తప్పారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పాతూరి నాగభూషణం ఆరోపించారు. వైఎస్సార్ సీపీ ఎన్నికల హామీల్ని నెరవేర్చడంలో విఫలమైందని తెలిపారు. గుంటూరు బ్రాడీపేటలోని గ్రాండ్ నాగార్జున హోటల్‌లో సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. పాతూరి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా కంటక పాలన సాగుతోందన్నారు. తమ పార్టీ గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వైఎస్సార్ సీపీ అక్రమాలపై చార్జిషీట్ విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో సర్పంచుల పరిస్థితి దుర్భరంగా ఉందని, వారికి నిధులతో పాటు విధుల్లేవని వెల్లడించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర పబ్లిసిటీ అండ్ లిటరేచర్ ప్రముఖ్ పాలపాటి రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శులు రాచుమల్లు భాస్కర్, కుమార్‌గౌడ్, అప్పిశెట్టి రంగా, తూర్పు నియోజకవర్గ కో-కన్వీనర్ వనమా నరేంద్ర, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ధారా అంబేడ్కర్, తానుచింతల అనిల్, రాష్ట్ర మీడియా కోకన్వీనర్ వెలగలేటి గంగాధర్ పాల్గొన్నారు.

హెన్రీ డునాంట్ ఆశయ సాధనకు కృషి

రెడ్ క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ రామచంద్రరాజు



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రరాజు

పాత గుంటూరు: సామాజిక సేవా రంగంలో నాలుగు సార్లు నోబుల్ బహుమతి పొందిన ఏకైక సంస్థ రెడ్ క్రాస్ మాత్రమేనని జిల్లా వైస్ చైర్మన్ శ్రీ పి రామచంద్రరాజు తెలిపారు. వరల్డ్ రెడ్ క్రాస్ డే సందర్భంగా బ్రాడీపేట మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి విపత్తుల నష్ట నివారణ, రక్తదాన శిబిరాల నిర్వహణ, ప్రథమ చికిత్స శిబిరాల ఏర్పాటు వంటి అంశాల్లో రెడ్ క్రాస్ విశిష్ట సేవలు అందిస్తోందని చెప్పారు. రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు శ్రీ హెన్రీ డునాంట్ ఆశయ సాధనకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల అధినేత మట్టుపల్లి మోహన్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సంస్థకు సభ్యునిగా ఉండటం గర్వంగా భావిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యూత్ రెడ్ క్రాస్ కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, రెడ్ క్రాస్ జిల్లా కోశాధికారి ఏ. రవి శ్రీనివాస్, మాస్టర్ మైండ్స్ ప్రతినిధి కోటేశ్వరరావు, రెడ్ క్రాస్ వలంటీర్స్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.